# సందేహాలు? సమాధానాలు!!

నిర్వహణ: శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి.

**ప్రశ్న?**

**శ్రీకృష్ణుడు నాగ్నజితిని ఏ విధంగా వివాహం చేసుకొన్నాడు? ఆ వివరాలు తెల్పండి.**

ఎస్. రవిప్రకాష్‌రాజు, మునగాల.

సమాధానం

శ్రీకృష్ణుని అష్టభార్యలలో నాగ్నజితి ఒకతె. ఈమె కోసలదేశాధిపతి అయిన నగ్నజిత్తు యొక్క పుత్రిక.

నగ్నజిత్తుయొక్క నగరంలో వాడి కొమ్ములు గల బలిష్ఠమైన వృషభాలు ఏడు ఉండేవి. అవి ప్రజలకు హాని కల్గిస్తుండగా నగ్నజిత్తు వాటిని బంధించడానికి ప్రయత్నించాడు. కాని అవి లొంగలేదు. అప్పుడు ''ఎవడు ఈ వృషభాలను నిగ్రహిస్తాడో వానికి నా కుమార్తె నిచ్చి వివాహం జరిపిస్తాను'' అని ఆరాజు ప్రకటించాడు.

శ్రీకృష్ణుడు వదించిన ఆ ఎద్దులను వధించాడు. రాజు ఆయనకు నాగ్నజితినిచ్చి వివాహం కావించాడు.

**ప్రశ్న?**

**స్త్రీలు వేదాలు చదువకూడదా?**

ఎ. అనసూయాదేవి, హైద్రాబాద్.

సమాధానం

సనాతనులు, సంప్రదాయవాదులు ''స్త్రీలు వేదాలు చదువకూడదు'' అనే అంటారు. ఇందుకు ప్రమాణంగా ''స్త్రీ శూద్రౌ నాధీయతాం'' అన్న శ్రుతిని చూపుతారు.

స్మృతులలో కూడా స్త్రీలకూ, ద్విజేతరులకూ వేదాధ్యయనాధికారం లేదు అనే స్పష్టంగా చెప్పబడివున్నది. అందుకే వారి కోసం పురాణాలు వ్రాయబడినాయని కూడా సంప్రదాయవాదులంటారు.

కాని వేదకాలంలో ఉపనిషత్కాలములో ఈ నిషేధం ఉన్నట్లు కనిపించదు. ఉపనిషత్తులు వేదాల చివరిభాగాలు. అందులో 'గార్గి' మొదలైన బ్రహ్మవాదినులగు స్త్రీల ప్రస్తావం ఉన్నది. వారు మహా సభలలో జరిగిన బ్రహ్మ తత్త్వ చర్చల్లో పాల్గొని వాదించి వున్నారు. ఉదాహరణకు బృహదారణ్యకంలోని గార్గీయాజ్ఞవల్క్యుల సంవాదం చూడవచ్చు.

పైగా వేదమంత్రాలను దర్శించిన కొందరు స్త్రీలు గూడా ఉన్నారు.

చూడాల, సులభ మొదలైన యోగినీ మణులు బ్రహ్మ విద్యలో ఆరితేరినట్లు యోగ వాసిష్ఠం, భారతం మొదలైన గ్రంథాలనుండి తెలుస్తున్నది. వారికి వేదాధికారం లేకపోతే వారెలా అంతటి బ్రహ్మవిద్యావైదుష్యం కలవారయ్యారు?

అందువల్ల ఆదికాలంలో ఈ నిషేధం లేదని ఊహించవచ్చు. ''స్త్రీ శూద్రౌ నాధీయతాం'' అనే శ్రుతి వచనం కల్పితం కావచ్చు అలా కల్పితవచనాలెన్నో మన ప్రాచీన గ్రంథాలలో ప్రవేశించాయని శ్రీ దయానంద స్వామి మొదలగువారు నిరూపించి నారు.

ఆధునిక యుగంలో హిందూమత సంస్కర్తలైన శ్రీదయానందస్వామి మొదలైన వారు స్త్రీలకు వేదాధ్యయనాధికారం కలదని అనేక ప్రమాణాలతో నిరూపించారు.

''యథేమాం వాచం కల్యాణీ మావదాని
జనేభ్యః, బ్రహ్మరాజన్యాభ్యాం
శూద్రాయ
చార్యాయ స్వాయ చారణాయ''

ఇత్యాది శ్రుతి వచనాలనూ, ''ఇమం మంత్రం పత్నీ పఠేత్'' ఇత్యాది సూత్ర వచనాలనూ నిర్దేశించి వారు స్త్రీలు వేదం చదువవచ్చు అని చెప్పారు. అందుకై కన్యా గురుకులాలను కూడా వారు స్థాపించారు.

సమాజంలో ఏ కారణంతోనో ఒక ఆచారం ఏర్పడిన తర్వాత, అది అనుచితమైన దైనా సరే, దానిని తొలగించడం కష్టసాధ్యం. అది మహాపురుషులకే సాధ్యం అవుతుంది. అస్పృశ్యతాది దురాచారాలు ఎంతగా ప్రయత్నించినా ఇంకా సమాజంలో అక్కడక్కడా పాటింపబడుతుండడం అనుభవంలో ఉన్న విషయమే.

అందువల్ల స్త్రీలు వేదం చదువకూడదన్న మూఢ విశ్వాసాన్ని కూడా క్రమంగా మహా ప్రయత్నంతో తొలగించి వైదికమతాన్ని పునరుద్ధరించుకోవాలి.

**ప్రశ్న?**

**శ్రీశుకమహర్షికి పుత్రులున్నారా? లేరా? వివరాలు తెల్పండి.**

కె. రామసుబ్బరావు, ద్రాక్షారామం.

సమాధానం

వ్యాసమునీంద్రుని పుత్రుడు శుకుడు. శివుని అనుగ్రహంతో వ్యాసుని కితడు జన్మించాడు. తండ్రిని మించిన తనయుడుగా పేరు పొందాడు. శుకమిథునాన్ని చూచి తాను మోహపరవశుడైనపుడు తనకు జన్మించడంవల్ల వ్యాసుడితనికి 'శుకుడు' అని నామకరణం చేశాడు.

వ్యాసునివద్దనే శుకుడు సమస్త విద్యలూ నేర్చాడు. ముక్తి మార్గాన్ని గూర్చి తండ్రి బోధించినప్పుడు శుకునికి తృప్తి కల్గలేదు. తండ్రి సలహామేరకు శుకుడు జనక మహారాజువద్దకు పోయి ఆత్మ తత్త్వాన్ని, ముక్తి మార్గాన్నీ అధ్యయనం చేసి పరితృప్తి పొందాడు.

శుకుడు సంసారవిముఖుడు కావడం చూచి జనకుడు అతనికి అవశ్యం సంసారం చేయవలసినదే అని నొక్కి చెప్పాడు. సన్యాసం కషాయపక్వం అంటే తక్కినమూడు ఆశ్రమాలూ అనుష్ఠించిన తర్వాత స్వీకరించేది అయితేనే హితకరమవుతుందని ఉపదేశించాడు.

శుకయోగి జనకుని ఉపదేశాన్ని అనుసరించి 'పీవరి' అనే కన్యను చేపట్టాడు. ఆమెయందు ''కృష్ణుడు'', ''గౌరప్రభుడు'', ''భూరి'', ''దేవశ్రవుడు'' అనే నల్గురు పుత్రులునూ, ''కీర్తి'' అనే ఒక పుత్రికనూ కన్నాడు. దేవీభాగవతాది గ్రంథాలలో ఈ విషయం వివరించబడింది.

కాని శుకుడు నైష్ఠిక బ్రహ్మచారిగా, సర్వ సంగపరిత్యాగిగా, అవధూతగా ప్రసిద్ధుడు. అలాంటప్పుడు అతనికి వివాహమయిందన్న విషయం నమ్మశక్యంకాదు. ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వరశతకంలో--

''పుత్రులు లేని యా శుకునకున్
బాటిల్లెనే దుర్గతుల్''

అనిచెప్పి శుకునికి పుత్రులు లేరన్న విషయాన్ని ధ్రువీకరించాడు.

ఇలా పరస్పర విరుద్ధమైన పెక్కు విషయాలు వివిధ గ్రంథాలలో కానవస్తాయి. వీటికి సమన్వయం సాధించడం కష్టమే. అయితే యుగభేదాన్ని బట్టి దీనిని సమన్వయించుకోవచ్చు.

వ్యాసుడొక్కడేకాడు. పెక్కుమంది వ్యాసులున్నట్లు యోగవాసిష్ఠాది గ్రంథాలు పేర్కొంటున్నాయి. కాబట్టి ఒక్కయుగంలో వ్యాసుని పుత్రుడైన శుకుడు అఖండ బ్రహ్మచారి అయితే మరొక యుగంలో అతడు సంసారిగా ఉండి ఉండవచ్చు. వ్యాసునివలె అతని సుతులైన శుకులు కూడా అనేకులుండటానికి అవకాశమున్నది. పురాణాలలో కనిపించే అనేక వైరుధ్యాలు యుగభేదాన్ని అంగీకరిస్తేనే సమన్వయిస్తాయి తప్ప వేరు మార్గంలేదు.

**ప్రశ్న?**

**శివుడు శిరస్సు మీద చంద్రుని ఎందుకు ధరించాడు?**

తులారాం పాండే, నంద్యాల.

సమాధానం

దక్ష ప్రజాపతి పుత్రిక సతీదేవిని శివుడు పరిణయమాడాడు. మామ అయిన దక్షుణ్ణి శంకరుడు తగురీతిలో గౌరవించేవాడు కాడు. తాను దేవుడుకాబట్టి దక్షుడే తనపట్ల వినయం చూపాలని శివుడు భావించేవాడు. ఇందుకు దక్షుడు సహించలేకపోయాడు.

దక్షుడు ఒకసారి యజ్ఞం చేయబూని శివుణ్ణి తప్ప తక్కిన దేవతలనందరినీ ఆహ్వానించాడు. సతీదేవికీ విషయం తెలిసింది. భర్త వద్దంటున్నా వినకుండా ఆమె యజ్ఞానికి వెళ్ళింది. అల్లుణ్ణి ఎందుకు ఆహ్వానించలేదు? అని తండ్రిని నిలదీసింది. దక్షుడు పరమ శివుణ్ణి తీవ్రంగా నిందించి అలాంటివాడు యజ్ఞంలో పాల్గొనడానికి అనర్హుడు అని తేల్చి చెప్పాడు. పతి దూషణం సహించలేక సతీదేవి యోగాగ్ని కల్పించుకొని అందులో కాలిపోయింది.

జరిగిన వృత్తాంతం తెలుసుకొన్న ఈశ్వరుడు దక్షయజ్ఞ ధ్వంసానికై వీరభద్రాదులను పంపాడు. వారు యజ్ఞాన్ని ధ్వంసంచేసి చిందులు త్రొక్కారు. ఆ త్రొక్కిసలాటలో దక్షుని మరో అల్లుడైన చంద్రుడు నలిగిపోయాడు.

ఆపై చంద్రుని పార్థన మన్నించి శివుడు అతణ్ణి తన శిరముపై ధరించాడని పురాణ కథనం.

ఇందుకు మరొక కారణం కూడా ఇలా కన్పిస్తున్నది. చంద్రుడు దక్షుని ఇరువదేడుగురు కుమార్తెలను పెండ్లి చేసుకొన్నాడు. కాని రోహిణియందే అతని కెక్కువ మక్కువ. ఇతర వనితలపట్ల ఆదరం చూపేవాడు కాడు. ఇది తెలిసి దక్షుడు కోపించాడు. చంద్రుణ్ణి క్షయవ్యాధి గ్రస్తుడవు కమ్మని శపించాడు. చంద్రుడు శివుణ్ణి వేడుకొన్నాడు. శివుడతణ్ణి కనికరించి తన శిరస్సుపై ధరించాడు.

ఇందువల్ల శివునికీ, దక్షునికీ వివాదం కల్గింది. విష్ణువు వారిద్దరికీ సంధి కుదిర్చాడు. చంద్రుణ్ణి రెండు భాగాలుగా చేసి అందొక భాగాన్ని శివుడు ధరించేటట్లూ, ఆ భాగాని కెప్పుడూ క్షయం లేకుండునట్లూ, రెండవ భాగానికి మాత్రం వృద్ధి క్షయాలు కల్గేటట్లూ, ఆ విధంగా దక్షుని శాపం కూడా సఫలమయ్యేటట్లూ సంధి కుదిరింది.